
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కర్ణాటక వార్తలు

మంగళవారం 7 మే 2024




అశ్లీల వీడియోలు ఉన్నా నేరమే!

బెంగళూరు, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం రేపిన రాసలీలల పెన్‌డ్రైవ్ వివాదం దర్యాప్తు చేపడుతున్న సిట్ అధికారులు సోమవారం ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు. సాంకేతిక సమాచార నిబంధనల ప్రకారం ఎవరైనా వ్యక్తికి సంబంధించిన అశ్లీల వీడియోలు, చిత్రాలు, ఆడియోలు ఉంచుకున్నా నేరమే అని ప్రకటించారు. ఇతరులకు పంపినా వాటిని నేరంగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మొబైల్ లేదా ఇతరత్రా పరికరాలలో ఇప్పటికే నిల్వ ఉంటే వీడియోలు, ఫొటోలు, ఆడియోలను డిలీట్ చేయడం ద్వారా చట్టపరమైన చర్యలనుంచి ఉపశమనం పొందవచ్చని సూచించారు.

నేడు ఓటరే.. రారాజు



బెళగావిలో ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరిన ఎన్నికల సిబ్బంది





- ఉత్తరకర్ణాటకలో 14 లోక్‌సభ స్థానాలకు నేడు పోలింగ్
- పోటీలో అతిరథులు.. మొత్తం 227 మంది అభ్యర్థులు
- 2.59 కోట్ల ఓటర్లు
- ఎన్నికల వీక్షణకు 5 దేశాల ప్రతినిధులు

బెంగళూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మలివిడత ఓట్ల పండుగకు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఉత్తరకర్ణాటక పరిధిలోని 14 లోక్‌సభ స్థానాలకు మంగళవారం పోలింగ్ జరగనుంది. సోమవారం సాయంత్రానికే అన్ని నియోజకవర్గాలకు ఈవీఎంలను తరలించారు. నెల రోజులుగా మండుటెండలతో అట్టుడికిన ఉత్తరకర్ణాటక ప్రాంతంలో వాతావరణంలో మార్పు చోటు చేసుకోవడంతో అందుకు అనుగుణంగానే ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు. 14 నియోజకవర్గాలకు సంబంధించి 227మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 2.59 కోట్లమంది ఓటు వినియోగించుకోనున్నారు. 14 స్థానాల్లోనూ కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్యనే ప్రధానమైన పోటీ కొనసాగుతోంది. జేడీఎస్‌తో పొత్తు ఉన్నా ఆ పార్టీ రెండో విడతలో ఎక్కడా పోటీ చేయడం లేదు. దీన్నిబట్టి జేడీఎస్ కేవలం మైత్రి మద్దతుకు అనుగుణంగా ప్రచారం చేసింది. మార్చి 16 నుంచే ఇక్కడ ఎన్నికల ప్రక్రియ జోరందుకుంది. ఏప్రిల్ 12న 14 స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైంది. దాదాపు నెలన్నరపాటు బహిరంగసభలు, రోడ్‌షోలతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు, వారి తరపున కుటుంబీకులు ప్రచారం చేశారు. ఆదివారం సాయంత్రంతో ప్రచారానికి తెరపడినా సోమవారం అభ్యర్థులు, వారి బంధువులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు ఇంటింటా వెళ్లి మద్దతు కోరారు.

హేమాహేమీల ప్రచారం

బీజేపీ అభ్యర్థుల తరపున ప్రధాని నరేంద్రమోదీ రెండు రోజులు ప్రచారం చేశారు. బెళగావి, శిరసి, దావణగెరె, బళ్ళారి, బాగల్కోటెలో ప్రచారం చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా హావేరి, హుబ్బళ్ళి, కలబురగి, చిక్కోడి నియోజకవర్గాలలో రోడ్‌షో జరిపారు. ఏఐసీసీ కీలక నేత రాహుల్‌గాంధీ శివమొగ్గ, రాయచూరు, కలబురగిలోనూ, ప్రియాంకగాంధీ దావణగెరె, హావేరి కలబురగిల్లోనూ ప్రచారం చేశారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బీదర్‌లో ప్రచారం చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కలబురగికి ప్రాధాన్యం ఇచ్చారు. సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు దాదాపు పదిరోజులపాటు అటువైపే మకాం వేశారు. బీజేపీ నేత యడియూరప్ప, పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత అశోక్‌లు విస్తృతంగా ప్రచారం చేశారు. తొలి విడత ఎన్నికల వేళ దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ పర్యటించిన దేవెగౌడ మలి విడత ప్రచారానికి దూరంగా ఉన్నారు. మనవడు ప్రజ్వల్ వివాదం బహిరంగం కావడంతో ఆయన ప్రచారానికి దూరమయ్యారు. కుమారస్వామి విస్తృతంగా ప్రచారం చేశారు.



ఓటింగ్ తీరుపై విదేశీయులకు అధికారుల విశ్లేషణ

హేమాహేమీలు..

రెండో విడత సమరంలో 14 నియోజకవర్గాల్లో చిక్కోడి, బెళగావి, బాగల్కోటె, ఉత్తరకన్నడ, బీదర్, రాయచూరు, బళ్ళారి, కొప్పళ, విజయపుర, కలబురగి, దావణగెరె, శివమొగ్గ, హావేరి, ధారవాడ నియోజకవర్గాలకు పోలింగ్ జరగనుంది. బరిలో ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు ఉన్నారు. హావేరి నుంచి బసవరాజ్ బొమ్మై, బెళగావి నుంచి జగదీశ్ శెట్టర్ పోటీ చేస్తుండగా కలబురగి నుంచి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమని పోటీలో ఉన్నారు. శివమొగ్గ నుంచి మాజీ సీఎంలు యడియూరప్ప కుమారుడు రాఘవేంద్ర, బంగారప్ప కుమార్తె గీతా శివరాజ్ బరిలో ఉన్నారు. గీతా శివరాజ్ సోదరుడు మధుబంగారప్ప ప్రస్తుత కేబినెట్ మినిస్టర్. వీరికి ప్రత్యర్థిగా బీజేపీ సీనియర్ నేత రెబెల్‌గా బరిలో ఉండడంతో ఇక్కడ ఎన్నిక కీలకమైంది.

ఎన్నికల వీక్షణకు 5 దేశాల ప్రతినిధులు

14 లోక్‌సభ స్థానాలకు జరుగుతున్న ఎన్నికలను పరిశీలించేందుకు 5 దేశాల ప్రతినిధులు రాష్ట్రానికి వచ్చారు. ఉత్తర కర్ణాటకలోని బెళగావికి చేరుకున్న బృందం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాప్రభుత్వం భారత్‌లో సాగుతున్న ఎన్నికల సరళిని పరిశీలించేందుకు వచ్చారు. కంబోడియా దేశం జాతీయ ఎన్నికల కమిటీ సభ్యుడు హల్ సరాత్, జాతీయ ఎన్నికల కమిటీ ముఖ్య కార్యదర్శి హౌట్ బోరింగ్, మాల్దీవ్స్ దేశానికి చెందిన కేంద్ర ఎన్నికల కమిషన్ ముఖ్యులు ఆడ్రియన్ గమర్రా ఎసాను, మల్దీవ్స్ ఎన్నికల కమిషన్ సభ్యురాలు డానా మంటేనువా, నేపాల్ ఎన్నికల ముఖ్య కమిషనర్ దినేశ్‌కుమార్ తాపాలియా, అదనపు కార్యదర్శి ధానేశ్వర్ బుసాల్, సిషెల్ దేశానికి చెందిన ఎన్నికల కమిషన్ ముఖ్యులు డ్యానీ సిల్వా లుకాస్, కమిషనర్ నుర్లిస్ నికోలస్ రోజ్ హౌరా, తునీషియా దేశానికి చెందిన ఎన్నికల హైకమిషనర్ మానశ్రీ, మహ్మద్‌తిలిలి, ప్రాంతీయ డైరెక్టర్ జల్లాలి నబిల్‌లు వచ్చారు. వారికి బెళగావి ఉత్తర విభాగం ఐజీపీ వికాస్ కుమార్, ఎస్పీ బీమాశంకర్ గుళేద్, ఐఏఎస్ అధికారి శుభంశుక్లాలు ఎన్నికల విధానాన్ని వివరించారు. వారు మంగళవారం వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించనున్నారు.



బెళగావిలో విదేశీ ప్రతినిధులు

అస్త్రాల హల్‌చల్

ఎన్నికల వేళ ప్రతి అంశం రాజకీయంగా హల్‌చల్ చేయనుంది. బీజేపీ, కాంగ్రెస్‌లు పలు అంశాలను ప్రధాన అస్త్రాలుగా చేసుకుని ప్రచారం సాగించాయి. కాంగ్రెస్ పార్టీ పన్నుల వాటా పంపిణీలో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి ప్రమాదమని, ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల వివాదంలో బీజేపీ నేతలు మౌనంగా ఉన్నారనే అంశాలపై ప్రశ్నించారు. ఇక బీజేపీ హుబ్బళ్ళిలో కళాశాల విద్యార్థిని నేహా హిరేమఠ దారుణ హత్య వివాదం, ఓబీసీ రిజర్వేషన్‌లలో కోత విధించి ముస్లింలకు ఇచ్చేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతోందనే ఆరోపణ, హిందువుల ఆస్తులను స్వాధీనం చేసుకుని మైనారిటీలకు పంచేందుకు కాంగ్రెస్‌పార్టీ వ్యూహం పన్నిందనే ఆరోపణలను అస్త్రాలుగా చేసుకున్నారు.

వారసులు.. గట్టెక్కేరా..?





- మలివిడత బరిలో యువనేతలు
- ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సీనియర్లు





రాఘవేంద్ర



గీతా శివరాజ్‌కుమార్



చిక్కోడి నుంచి బరిలో దిగిన మంత్రి సతీశ్ జార్కిహొళి కుమార్తె ప్రియాంక జార్కిహొళి

బెంగళూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండో విడత పోలింగ్‌లో అందరి నోటా ఒకేమాట అనేలా మారింది. తొలి విడత సమరంలో పలువురు కీలక అభ్యర్థులతోపాటు భిన్నమైన రంగాల్లో జాతీయస్థాయిలో పేరొంది తొలిసారి ఎన్నికల బరిలోకి దిగి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రయత్నించారు. అయితే రెండో విడతలో 6 నియోజకవర్గాలలో వారసులు ఉండడంతో వారిలో ఎంతమంది గట్టెక్కుతారనేది రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వీరిలో పలువురికి రాజకీయ అనుభవం లేకున్నా ఇన్‌చార్జ్ మంత్రులపై అధికార కాంగ్రెస్ పెట్టిన కండీషన్‌ల కారణంగా వారసులకు టిక్కెట్‌లు దక్కించుకున్నారు. ఓ రకంగా మేం మంత్రులుగా కొనసాగుతున్నప్పుడే మా పిల్లలను రాజకీయాల్లోకి తీసుకొచ్చామనే సంతృప్తితో ఉన్నా మరోవైపు అన్ని పదవులు వీరి కుటుంబాలకేనా, మరెవ్వరూ పార్టీలో లేరా అనే విమర్శలను ఎదుర్కొంటున్నారు. దీంతో రెండో విడత పోలింగ్ ప్రతిష్టాత్మకమైంది. వారసులలో బెళగావి జిల్లా చిక్కోడి నుంచి మంత్రి సతీశ్ జార్కిహొళి కుమార్తె ప్రియాంక జార్కిహొళి తొలిసారి అభ్యర్థి అయ్యారు. బెళగావి నుంచి ఏకైక మహిళా మంత్రి లక్ష్మీ హెబ్బాల్కర్ కుమారుడు మృణాల్ హెబ్బాల్కర్ తొలిసారి పోటీ చేస్తున్నారు. ఇక బీదర్ నుంచి మంత్రి ఈశ్వర్‌ఖండ్రె కుమారుడు సాగర్ ఖండ్రె ప్రస్తుతం బరిలో ఉన్న అభ్యర్థులందరికంటే పిన్నవయస్కుడు. కేవలం 26ఏళ్లకే లోక్‌సభ బరిలోకి దిగాడు. మరో మంత్రి శివానందపాటిల్ కుమార్తె సంయుక్తా పాటిల్ బాగల్కోటె నుంచి పోటీ చేస్తున్నారు. వీరితోపాటు శివమొగ్గ నుంచి మంత్రి మధుబంగారప్ప అక్క గీతా శివరాజ్ పోటీలో ఉన్నారు. గతంలోనూ ఆమె జేడీఎస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం మధు బంగారప్ప కాంగ్రెస్‌లో ఉండడంతో కాంగ్రెస్ అభ్యర్థి అయ్యారు. ఇదే స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా మాజీ సీఎం యడియూరప్ప కుమారుడు, సిట్టింగ్ ఎంపీ రాఘవేంద్ర పోటీ చేస్తున్నారు. దావణగెరె నుంచి మంత్రి మల్లికార్జున భార్య ప్రభా తొలిసారి పోటీ చేస్తున్నారు. ఇదే స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి జీఎం సిద్దేశ్వర్ భార్య గాయత్రి తొలిసారి పోటీ చేస్తున్నారు. ఇక మరో కీలకమైన అంశం కలబురగి నుంచి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమని తొలిసారి రాజకీయాల్లోకి వచ్చారు. ఖర్గే కుమారుడు ప్రియాంక ఖర్గే రాష్ట్ర కేబినెట్‌లో కీలకమంత్రిగా ఉండగా వారి కుటుంబం నుంచి మరో వారసుడు బరిలోకి దిగినట్టయ్యింది.

రేవణ్ణ ఇంట్లో సిట్ పంచనామా



బెంగళూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల వివాదంలో బాధితురాలి కిడ్నాప్ కేసులో సిట్ అధికారులు సోమవారం రేవణ్ణ ఇంటిని పంచనామా చేశారు. ఉదయమే సిట్ ముఖ్య అధికారులు బెంగళూరు బసవనగుడిలోని రేవణ్ణ ఇంటికి చేరుకున్నారు. బాధితురాలిని వెంట తీసుకొచ్చి పంచనామా చేశారు. సుమారు ఐదు గంటలపాటు సిట్ అధికారులు సమగ్ర వివరాలు సేకరించారు. కాగా ఐదుగురు మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు సిట్ నోటీసులు ఇవ్వదలిచినట్లు తెలుస్తోంది. దీంతో ఉద్యోగుల్లో దడ మొదలైంది. కాగా రేవణ్ణ మరోసారి బెయిల్‌పిటీషన్ దాఖలు చేశారు. ఇప్పటికే బెయిల్‌కోసం దరఖాస్తు చేసుకోగా శనివారం సాయంత్రం దాకా విచారణ జరిపిన కోర్టు సదరు పిటీషన్‌ను రద్దు చేసింది. దీంతో రేవణ్ణ అరెస్టు అనివార్యమైంది. ఎంపీ ప్రజ్వల్ రాసలీలల పెన్‌డ్రైవ్ వివాదంలో బెయిల్ వచ్చే సెక్షన్‌లు ఉన్నా బాధితురాలి కిడ్నాప్ గురి కావడంపై ఆయన అరెస్టు అనివార్యమైంది. దీంతో మరోసారి రేవణ్ణ తరపు న్యాయవాదులు బెయిల్ పిటీషన్‌ను సోమవారం దాఖలు చేశారు. విచారణకు స్వీకరించిన ధర్మాసనం మంగళవారానికి వాయిదా వేసింది.

కాంగ్రెస్ నుంచి ఆఫర్

పెన్‌డ్రైవ్ విషయంలో కాంగ్రెస్ నుంచి భారీ ఆఫర్ వచ్చిందని హాసన్ బీజేపీ నాయకుడు, న్యాయవాది దేవరాజేగౌడ ఆరోపించడం కలకలం రేపుతోంది. బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ పెన్‌డ్రైవ్ బయటకు వచ్చేందుకు ఏకైక సూత్రధారి డీసీఎం డీకే శివకుమార్ అంటూ ఆరోపించారు. ఓ ఆడియోను విడుదల చేశారు. సిట్ అధికారి సుమన్ పర్నేకర్ ఓ ఫొటో చూపి వీరిపేరు తొలగించాలని సూచించారన్నారు. ఈ వివాదం వెనుక కాంగ్రెస్ ప్రభుత్వ కుట్ర ఉందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత కేబినెట్‌స్థాయి హోదా కల్పిస్తామని తనకు ఆఫర్ ఇచ్చారన్నారు. బాధితురాలికి సొమ్ము ఇచ్చి తీసుకొచ్చారని, మాజీ ఎంపీ శివరామేగౌడను మధ్యవర్తిగా పంపారని ఆరోపించారు. సీబీఐకు అన్ని రికార్డులు ఇచ్చేందుకు సిద్ధమని వెల్లడించారు. తన వద్ద ఉండే పెన్‌డ్రైవ్‌లో లేని వీడియోలు బహిరంగమయ్యాయన్నారు. ప్రస్తుతం విడుదలైన వీడియోలకు తనకు సంబంధం లేదన్నారు. 2గంటల 37 నిమిషాల వీడియో ఉందని అయితే ప్రస్తుతం లీక్ అయినవి మిక్సింగ్ చేసినవేనన్నారు. ఇప్పటికే పలువురు డీసీఎం డీకే శివకుమార్‌పై ఆరోపణలు చేసిన నేపథ్యంలో దేవరాజేగౌడ మీడియా ముందుకు రావడం మరో సంచలనమైంది.

పెళ్లి.. లొల్లి

- స్వీట్ ఇవ్వలేదని ఆగిన వివాహం
- వధువు కుటుంబంపై వరుడి బంధువుల దాడి
- పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయితీ
- కొడగు జిల్లాలో సోమవారపేటలో ఉదంతం

బెంగళూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): పెళ్లి కొడుకు బంధువులకు స్వీట్లు ఇవ్వలేదన్న కారణంతో తలెత్తిన వివాదం వధూవరుల కుటుంబీకుల మధ్య గొడవకు దారి తీసి ఏకంగా పెళ్లి వాయిదా పడింది. కొడగు జిల్లా సోమవారపేటలో ఈ ఘటన చోటు చేసుకుంది. బెంగళూరులోని ప్రైవేట్ కంపెనీలో పనిచేసే వధూవరులకు మ్యాట్రిమొని ద్వారా పరిచయం అయ్యింది. ఆదివారం రాత్రి రిసెప్షన్ కాగా సోమవారం ఉదయం పెళ్లి జరగాల్సి ఉండేది. సోమవారపేటలోని కల్యాణమండపంలో భారీగా ఏర్పాట్లు చేశారు. రిసెప్షన్ వేళ పెళ్లికొడుకు బంధువులకు స్వీట్ ఇవ్వలేదనే కారణంతో గొడవ తలెత్తింది. ఇరువర్గాల మధ్య వివాదం తారస్థాయికి చేరి ఒకరినొకరు తోసుకునే స్థితికి చేరింది. పెళ్లిరోజునే ఇంత హంగామా చేసినవారు భవిష్యత్తులో ఎన్ని ఇబ్బందులు పెడతారోనని పెళ్లికి వధువు ససేమిరా అన్నారు. అంతలోనే వధూవరులు నిశ్చితార్థం మార్చుకున్న ఉంగరాలను వాపసు ఇచ్చేశారు. సోమవారపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు రంగంలోకి దిగి ఇరువర్గాలను శాంతింపజేశారు. వధువు కుటుంబీకుల అభిప్రాయం మేరకు పెళ్లికి ముందే బంగారం, బెంగళూరులో ప్లాట్ ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. పెళ్లి రోజున బంగారం ఇవ్వలేదనే కారణంతో స్వీట్ నెపం చూపారని ఆరోపించారు. సోమవార పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.



పోలీస్ స్టేషన్ ముందు గొడవ చేస్తున్న వరుడి బంధువులు

20నుంచి ధర్మరాయస్వామి జాతర



మీడియాతో ధర్మరాయస్వామి ఆలయ సమితి నిర్వాహకులు

బంగారపేట, మే 6: పట్టణంలోని ధర్మ రాయ స్వామి ఆలయ జాతర, కరగ మహోత్సవం ఈనెల 20వ తేదీ నుంచి 26వరకు జరగనుంది. ఆలయ సేవాకర్తర క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు సీ రామమూర్తి సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఈసారి కరగను మరింత వైభవంగా ఆచరించనున్నట్టు తెలిపారు. బంగారపేట పట్టణం క్రమేపీ విస్తరించడంతో పూలకరగ ఊరేగింపు ప్రముఖ వీధులలో మాత్రమే సంచరిస్తుందన్నారు. మరుసటి రోజు సాయంత్రం 6 గంటలకు అగ్నిగుండప్రవేశం ఉంటుందన్నారు. సమితి ఉపాధ్యక్షుడు చిన్ని వెంకటేశ్ మాట్లాడుతూ కరగ మహోత్సవంలో 20న ధ్వజారోహణ, 21న హారతి దీపోత్సవం, 22న హసికరగ, 23న సేలంనగర్‌లో ఉట్లు జాతర, 24న ఉదయం కల్యాణోత్సవం, రాత్రి పూలకరగ, 25న అగ్నిగుండ ప్రవేశం, 26న వసంతోత్సవం జరుగుతాయన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని భక్తులను కోరారు. ఈ సందర్భంగా జయరాం, సమితి సభ్యులు పాల్గొన్నారు.



కరగ ఊరేగింపులో భక్తులు (ఫైల్)

ఉద్యోగావకాశాలు కల్పించే వారికే ఓటు



తొలిసారి ఓటు వేస్తున్నా.. గత ఐదేళ్లలో నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉద్యోగాలు, ఉపాధి కోసం బెంగుళూరు, హైదరాబాదు వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. స్థానికంగా పరిశ్రమలు నెలకొల్పితే బాగుంటుంది. ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. కియా పరిశ్రమ లాంటివి వస్తే యువతకు ఉపాధి అవకాశాలు దక్కుతాయి. ఉద్యోగ నోటిఫికేషన్లు లేకపోవడం తీవ్ర నిరాశకు గురయ్యాం. ఉద్యోగాల భర్తీకి తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి యువకుడు ఇదేవిధంగా ఆలోచిస్తున్నారు. అలాంటి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలనుకుంటున్నారు.

- సూర్యప్రతాప్‌గౌడ్, సిండికేట్ నగర్ అనంతపురం రూరల్

చెరువులకు నీళ్లిస్తామని మాట తప్పారు..

అధికారంలోకి వస్తే కృష్ణా జలాలను హంద్రీనీవా కాలువల ద్వారా తీసుకు వచ్చి చెరువులను నింపి సాగు, తాగునీటి సమస్య పరిష్కరిస్తామని చెప్పిన వైసీపీ నాయకులు అధికారంలోకి వచ్చాక హామీని గాలికి వదిలేశారు. ఒక్కచెరువుకు నీరు నింపలేదు. దీంతో వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. బోర్లలో నీళ్లు లేక పండ్లతోటలు ఎండిపోతున్నాయి. దీనికి తోడు బోర్లకు మీటర్లు బిగించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక పోయారు. హంద్రీనీవా కాలువల ద్వారా చెరువులకు నీరు వదిలి తాగు, సాగు నీటి సమస్య పరిష్కరించాలి.



- యంజారప్ప, రైతు, మల్లినమడుగు, రొళ్ల మండలం(మడకశిర)

బాబుకు దివ్యాంగులు రుణపడి ఉంటారు



చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే దివ్యాంగులకు పింఛన్ రూ.6వేలు ఇస్తారు. ఆ పార్టీ మేనిఫెస్టోలో దివ్యాంగులకు హామీ ఇచ్చారు. దివ్యాంగులు అందరూ బాబుకు రుణపడి ఉంటారు. నేను బీఏ వరకు చదువుకున్నాను, దివ్యాంగుడిని. జగన్ దివ్యాంగులకు సంక్షేమంలో ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదు. ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. ఇప్పుడు పింఛన్ రూ.3వేలు ఇస్తున్నారు. చంద్రన్న నెలకు రూ.6వేలు పింఛన్ ఇస్తానని హామీ ఇచ్చారు. తప్పకుండా హామీ నెరవేరుస్తారని ఆశతో ఉన్నాం.

- ఆదినారాయణ, దివ్యాంగుడు, శింగనమల

జగన్‌ను కాదు.. మమ్మల్ని చూడండి

ప్లీజ్.. ప్లీజ్.. డబ్బులిస్తాం ఓటెయ్యండి

వైసీపీ శ్రేణులు, అనుకూల ఉపాధ్యాయ నేతల వేడుకోలు

అనంతపురం టౌన్, మే 6: 'చూడండి సార్, మేడమ్.. మీరు జగన్‌ను చూడొద్దు .. ఇక్కడ లోకల్‌గా అనంత వెంకటరామిరెడ్డిని, మమ్మలను చూడండి.. ప్లీజ్.. ప్లీజ్.. కావాలంటే డబ్బులిస్తాం, మాకు ఓటెయండి' అంటూ అధికార వైసీపీ శ్రేణులు, ఆ పార్టీకి అనుకూలంగా ఉన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోస్టల్ ఓట్ల కోసం జిల్లా కేంద్రంలో బేరమాడడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల వైసీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్‌తోపాటు ప్రజాప్రతినిధులు, ఐఏఎస్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం, పీఆర్‌సీ, హెచ్‌ఆర్‌ఏలు కట్‌చేసి జీతాలు తగ్గించడం, అడిగినోళ్లపై కక్షసాధింపులకు దిగడం వంటివి చేస్తూ వచ్చారు. ఇలా అనే రకాలుగా వేధింపులకు గురైన ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈసారి సీఎం జగన్ పట్ల తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో సీఎంకు వ్యతిరేకంగా 80శాతానికి పైగానే ఓట్లు వేస్తున్నారని ఆయా వర్గాలు చెబుతున్నాయి. దీంతో అనంతపురం జిల్లా కేంద్రంలో వైసీపీ నేతలు, ఆ పార్టీకి అనుకూలంగా ఉన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, టీచర్లు వినూత్న ప్రచారం ఎత్తుకున్నారు. ఎలాగైనా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను తమవైపు తిప్పుకోవాలని, ఓటు వేయడానికి వస్తున్న వారికి రెండు వేలిస్తాం, మూడు వేలిస్తాం అంటూ వేడుకుంటూ ప్రలోభాలకు గురిచేస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. 'వీరికెంత సిగ్గులేదప్పా.. ఇంత అన్యాయం చేసి మళ్లీ ఇంత బరితెగించి ఓట్లు అడుగుతున్నారు' అని పెదవి విరుస్తున్నారు. సీఎం జగన్ పేరు చెప్పి ఓటు అడిగితే ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఓట్లు వేయరని వైసీపీ నాయకులే అంటున్నారంటే.. ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవచ్చు.





అర్ధంతరంగా ఆగిన కాలువ పనులు



నీరులేక వెలవెలబోతున్న గుండ్లపల్లి చెరువు

ఇవి రోడ్లేనా..?

మోకాలి లోతు గుంతల్లో ప్రయాణం

వాహనదారులకు నరకప్రాయం

మరమ్మతులకు నోచుకోని రహదారులు

ప్రతి పల్లెకు రోడ్లు వేశామంటూ వైసీపీ ప్రచారాలు



మూడేళ్లుగా కంకర వేసి వదిలేసిన పాల్తూరు-కరకముక్కల రోడ్డు

విడపనకల్లు: ఉరవకొండ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకార్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్లవుతున్నా కొత్తరోడ్లు వేయకపోగా.. ఉన్న రోడ్లను కూడా తవ్వి వదిలేశారు. వైసీపీ పాలకుల పుణ్యమా అంటూ కంకర్లు తేలిన రోడ్లతో ఆయా గ్రామాల ప్రజలు నరక ప్రయాణం చేస్తున్నారు. మూడేళ్ల క్రితం కరకముక్కల-పాల్తూరు రోడ్డు వేయిస్తామంటూ దాదాపుగా మూడు కిలోమీటర్లు మేర బాగున్న రోడ్డును తవ్వించి కంకర వేసి వదిలేశారు. ఈ కంకర దారిలో ఆయా గ్రామాలకు వెళ్లే వాహనదారులు ప్రతి రోజూ ఏదో ఒకచోట ప్రమాదానికి గురవుతున్నారు. దీంతో పాల్తూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులే రోడ్డుపైకి వచ్చి ధర్నా చేశారు. తారు రోడ్డు వేయటానికి చేత కాకా పోతే కనీసం మట్టి రోడ్డు అయినా వేయండి అంటూ వైసీపీ ప్రముఖ నాయకులు డిమాండ్ చేశారు. కానీ, అధికారుల్లో కానీ, ఆ పార్టీ నాయకుల్లో ఏమాత్రం చలనం రాలేదు. నాలుగేళ్లుగా కంకర వేసిన రోడ్డును పట్టించుకునే నాథుడేలేడని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విధంగా ఆర్.కొట్టాల-డొనేకల్లు రోడ్డును రెండేళ్ల క్రితం ఎక్స్‌కవేటర్లతో తవ్వించి చిన్న కంకర వేసి వదిలేశారు. నిధులు లేవంటూ పనులు నిలిపివేయటంతో ఆ రోడ్డున వెళ్లే రైతులు, గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల అధికారుల నుంచి జిల్లా కలెక్టర్ వరకూ ఫిర్యాదులు చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదు. గాజుల మల్లాపురం వెళ్లే మట్టి రోడ్డుపై వర్షాల కాలంలో మోకాలి లోతు గుంతలు పడి కనీసం మనుషులు కూడా నడిచి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వి.కొత్తకోట-విడపనకల్లు రోడ్డును గత టీడీపీ ప్రభుత్వంలో మర్మతులు చేయించారు. ప్రస్తుతం ఈ రోడ్డు మొత్తం వర్షాల కారణంగా కంకర్లు తేలి అధ్వానంగా మారిపోయింది. రోడ్డు పనులు చేయించాలని జిల్లా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా దిక్కులేదు. విడపనకల్లు మండలం జనార్దనపల్లి నుంచి వజ్రకరూరు మండలం చాబాల వరకూ రోడ్డు పూర్తిగా ధ్వంసమయింది. ఈ మూడు కిలో మీటర్లు ప్రయాణం వాహనదారులకు నరకప్రాయంగా మారింది. కంకర్లు తొలగించి కనీసం మట్టి వేసినా బాగుండేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. బూదగవి-చీకలగురికి రోడ్డు మరీ దారణంగా మారి పోయింది. రెండు చోట్ల బ్రిడ్జిలు పూర్తిగా శిథిలమయ్యాయి. రోడ్డు మొత్తం కంకర తేలింది. వజ్రకరూరు మండలంలోని రాగులపాడు నుంచి పందికుంట వరకూ రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. నియోజకవర్గంలోని మరుట్ల రోడ్డు మరీ దారుణంగా మారిపోయాయి. కనీసం ద్విచక్రవాహనం కూడా వెళ్లని పరిస్థితిలో దారులు ఉన్నాయి. ఇంత దారుణంగా ఉన్నా వైసీపీ నాయకులకు ఏ మాత్రం కనిపించటంలేదు. ప్రతి గ్రామంలోను రోడ్లు వేశామంటూ ప్రచారం చేస్తుండడంపై గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. ఒక్క రోడ్డు కూడా వేసిన పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొలాలకు వెళ్లాలంటే ఇబ్బంది



ఆర్.కొట్టాల నుంచి డొనేకల్లుకు వెళ్లే దారిని రెండేళ్ల క్రితం ఎక్స్‌కవేటర్లతో తవ్వించి చిన్న కంకర వేసి వదిలేశారు. పంటల కాలంలో రోడ్డును తవ్వటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తారు రోడ్డు వేయండి, లేదా కంకర తొలగించి మట్టి రోడ్డు అయినా వేయండని తహసీల్దారు కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చినా స్పందించలేదు. ధర్నాలు చేసినా అధికారుల్లో కానీ, అధికార పార్టీ నాయకుల్లో కానీ చలనం రాలేదు. ఇప్పటికి ఈ రోడ్డుపై కంకర అలాగే ఉంది. రైతులకు, ద్విచక్ర వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. నిధుల లేవంటూ ఉన్న రోడ్డును తవ్వించి కంకర వేసి వదిలేశారు.

- పురుషోత్తంనాయుడు, ఆర్.కొట్టాల

ఐదేళ్లుగా గంప కంకర కూడా వేయలేదు



మా గ్రామానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు వేశారు. ఇంక ఇప్పటి వరకూ ఒక్క గంప కంకర కూడా వేయలేదు. వర్షాల ధాటికి తారు రోడ్డు పూర్తిగా దెబ్బతిని ఎక్కడిక్కడ గుంతలు పడి పోయి కంకర్లు తేలాయి. కనీసం మనుషులు కూడా రోడ్డుపై తిరగలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులకు గ్రీవెన్స్‌లో ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఐదేళ్ల కాలంలో వైసీపీ నాయకులు మా గ్రామంవైపు తిరిగి చూడలేదు. ఇప్పుడు రోడ్లు వేస్తాం.. ఓటు వేయండి అని అడిగేందుకు వస్తున్నారు.

- కె.రంగస్వామి, వి.కొత్తకోట




కంకర తేలిన వి.కొత్తకోట-విడపనకల్లు రోడ్డు



మోకాలి లోతు గుంతలతో నిండిన గాజుల మల్లాపురం మట్టి రోడ్డు



కంకర తేలిన జనార్దనపల్లి-ధర్మపురి రోడ్డు



ఛిద్రమైన చాబాల-ధర్మపురి రోడ్డు

కంకర వేసి.. వదిలేశారు



నాలుగేళ్ల క్రితం కరకముక్కల-పాల్తూరు రహదారిలో తారు వేయాలని ఎక్స్‌కవేటర్లతో తవ్వించి 40 ఎంఎం కంకర వేశారు. నిధులు లేకపోవటంతో కాంట్రాక్టర్ రోడ్డు పనులు చేయకుండా వదిలేశాడు. కంకర తొలగించి కనీసం మట్టి రోడ్డు అయినా వేయండి అంటూ వైసీపీ నాయకులే రోడ్డుపై నిరసన తెలిపినా ప్రభుత్వం స్పందించలేదు. కంకర రోడ్డుపై పడిన చాలా పశువులు మృతి చెందాయి. అనేక మంది ద్విచక్ర వాహనదారులు కిందపడి ఆసుపత్రుల పాలయ్యారు. నియోజకవర్గ ఇన్‌చార్జి అని చెప్పుకునే విశ్వేశ్వరరెడ్డికి పాల్తూరు రోడ్డు కనిపంచక పోవటం ఏమిటి. పల్లెల్లో అభివృద్ధి చేశామంటూ ఉత్తుత్తి మాటలు చెప్పి ఓట్లు అడిగేందుకు వస్తున్నాడు.

- చౌడికి గంగన్న, పాల్తూరు

హామీ మరిచారు

నీరులేక బోసిపోతున్న చెరువులు

అడుగంటిన భూగర్భజలాలు

బీళ్లుగా మారుతున్న వ్యవసాయ తోటలు

గట్టెక్కేది ఎట్లా అంటూ రైతుల ఆందోళన

బెళుగుప్ప: మండలంలో ఎలాంటి సాగునీటి వనరులు లేవు. తీవ్ర వర్షాభావంతో భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో వ్యవసాయ బోర్లలో నీటి మట్టం తగ్గి, వాటి కింద సాగు చేసే వ్యవసాయ తోటలు బీళ్లుగా మారుతున్నాయి. అందుబాటులో ఉన్న చెరువుకు నీరుచేరితే తాగు, సాగు నీటి సమస్య తీరుతుంది. మండలంలో పది చెరువులుండగా.. గత టీడీపీ హయాంలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ రైతుల ఇబ్బందుల ను దృష్టిలో ఉంచుకుని శీర్పి, బెళుగుప్ప చెరువులను జీడిపల్లి రిజర్వాయరు ద్వారా కృష్ణా జలాలతో నింపారు. మిగిలిన చెరువులకు నీరిచ్చేందుకు కాలువ పనులు కొనసాగుతుండగా ముందుగా పరిహారం చెల్లించి కాలువలు తవ్వాలని వైసీపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. దీంతో కాలువల పనులు నిలిచిపోవడంతో కృష్ణా జలాలతో చెరువులు నింపడం ముందుకు సాగలేదు. ఈ లోగా ఎన్నికలొచ్చాయి. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రాగానే అన్ని చెరువులు నింపి రైతన్నల సమస్యలు తీరుస్తామని అప్పట్లో ఆ పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. అలాగే తవ్విన కాలువల కోసం సేకరించిన భూములకు నష్ట పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చింది. దాదాపు అయిదేళ్లు గడిచిపోయాయి. అయితే ఈ ఐదేళ్ల కాలంలో వైసీపీ నాయకులు ఇచ్చిన హామీ గురించి పట్టించుకోలేదు. కాలువలు పూర్తి కాలేదు. నీటితో చెరువులు నిండలేదు. చెరువులకు నీరొస్తే తమ కష్టాలు తీరుతాయని అనుకున్న మండలంలోని రైతులకు నిరాశే మిగిలింది. బోర్లన్నీ ఎండిపోయి వ్యవసాయ తోటలు బీళ్లుగా మారాయి. ప్రస్తుతం పరిస్థితుల్లో చెరువులను నీటితో నింపితే తప్ప తాము గట్టెక్కలేమని ఆవేదన చెందుతున్నా రు. ఈ ఐదేళ్ల కాలంలో రైతులకు ఇచ్చిన హామీ గురించి పట్టించుకోని వైసీపీ నాయకులు, మళ్లీ ప్రస్తుత ఎన్నికల సందర్భంగా పాత పాట మొదలెట్టారు. వైసీపీని గెలిపించండి అన్ని చెరువులు నింపుతామని ఊకదంపుడు మాటలు చెబుతున్నారు. ఈ ఐదేళ్లు ఏమి చేసినట్లు.... ఇక చాలు మీ బూటకపు హామీలని రైతులు అంటున్నారు.

చెరువుకు నీరొస్తేనే గట్టెక్కేది..



చెరువులో నీరు లేక బోర్లన్నీ ఎండిపోతున్నాయి. నాకు నాలుగు ఎకరాల వ్యవసాయ తోటలో రెండు బోర్లలో గతంలో నీరొచ్చేది. ఇప్పుడు అవి రెండింటిలో నీరు రావడం లేదు. నీరు లేకపోవడంతో పంటలు సాగు చేయ లేక పోతున్నా. పొలాన్ని బీడు పెట్టాల్సి వస్తోంది. చెరువుకు నీరు వదిలితేనే వ్యవసాయం చేసి, నా కష్టాల నుంచి గట్టెక్కే అవకాశం ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చక పోవడంతో, మా సమస్యలు పరిష్కారం కాలేదు.

- సురేష్‌బాబు, రైతు, కోనాపురం

నేడు, రేపు పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం

ఓటు ఉన్నచోటుకు డ్యూటీ ఆర్డర్‌తో వెళ్లాలి... కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, మే 6: ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరికీ పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 3 నుంచి ఆయా నియోజకవర్గాల్లో ఓటింగ్ చేపట్టామని తెలిపారు. తొలి రెండు రోజులు కొంత గందరగోళం ఉన్నా ఇపుడు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ షెడ్యూల్ మేరకు సోమవారం ముగియాలన్నారు. చాలామంది ఓటు వినియోగించుకోకపోవడం, కొందరి పేర్లు జాబితాలో లేకపోవడంతో మరో రెండు రోజులు గడువు పొడగిస్తూ ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. ఎన్నికల విధులకు నియమించి, ఓటర్ల జాబితాలో పేర్లు లేనివారికి మరో రెండురోజులు (మంగళ, బుధ) అవకాశం ఇస్తున్నామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ జాబితాలో పేర్లు లేనివారు ఆర్డర్‌తోపాటు ఓటరు ఐడీ, ఏదైనా గుర్తింపుకార్డు తీసుకొని ఓటు ఉన్నచోటుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. సమస్య వస్తే జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే జిల్లాలో

నిబంధనల మేరకే హోం ఓటింగ్

హోం ఓటింగ్ ప్రక్రియ కొనసాగిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. 85ఏళ్లు పైబడి నడవలేని వృద్ధులు, దివ్యాంగులకు హోంఓటింగ్‌కు ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చిందన్నారు. జిల్లాలో 85 ఏళ్లు పైబడిన వృద్ధులు 618 మంది, దివ్యాంగులు 629 మంది మొత్తం 1247 మంది హోంఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరికి ఈనెల 5నుంచి కమిషన్ నిబంధనల మేరకు 38 ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి హోం ఓటింగ్ చేపడుతున్నామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

రూ.32.37 కోట్లు సీజ్... రూ.27 కోట్లు రిలీజ్...

జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి రూ. 32.37 కోట్లు సీజ్‌చేశామని కలెక్టర్ తెలిపారు. సంబంధిత వ్యక్తులు ఆధారాలు చూపించిన తర్వాత అందులో రూ. 27 కోట్లు రిలీజ్ చేశామని వివరించారు. విచారణ అనంతరం 30 కిలోల బంగారం, వెండిని కూడా రిలీజ్ చేశామన్నారు. ఇటీవల అనంతపురం నగరంలో రూ. 1.50 కోట్లు పట్టుబడిందని, ఆ డబ్బు కదిరికి చెందిన వ్యక్తిది అని చెప్పడంతో సత్యసాయి జిల్లాకు ఈ కేసును రెఫర్ చేశామని కలెక్టర్ వెల్లడించారు.

ఉపాధి కల్పనకు పెద్దపీట

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాం

టీడీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి

ప్రచారంలో అడుగడుగునా బ్రహ్మరథం

పుట్టపర్తి, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి గెలుపు ఖాయమైందని, మరికొన్ని రోజుల్లో జగన్ రాక్షస పాలన అంతం కాబోతోందని హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాప్తాడు, పెనుకొండ, పుట్టపర్తి నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు పరిటాల సునీత, సవిత, పల్లె సింధూరరెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు, కేంద్రంలో మోదీ సంకల్పపత్ర్ జత చేసి సంక్షేమంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. ఉపాధి కల్పనకు పెద్దపీట వేయడమే తమ కూటమి లక్ష్యమని చెప్పారు. ఆర్థికంగా, అభివృద్ధి పరంగా గాడితప్పిన రాష్ట్రాన్ని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పునః నిర్మాణం చేపడతారని అన్నారు. హిందూపురం పార్లమెంట్ నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. ప్రతి చెరువుకు నీరుతెచ్చి ప్రతి ఎకరా సాగులోకి తీసుకువస్తామన్నారు. పార్లమెంట్ నియోజక పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి పరిశ్రమలు తీసుకువచ్చి వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో రాష్ట్రంలో జిల్లాను అగ్రగామిగా నిలబెడతానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఆంక్షలు లేని సంక్షేమం, అభివృద్ధి నిలయంగా పార్లమెంట్ నియోజక వర్గాన్ని చేస్తానని అన్నారు. యువత వారి కాళ్లపై వారు నిలబడే విధంగా నియోజక వర్గాల వారిగా నైపుణ్య శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలు చూపించి నిరుద్యోగిత తగ్గించడానికి ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర రాష్ట్రాల సాయంతో యువతకు ఉపాధి, మహిళలకు సాధికారిత సాధించేలా కృషి చేస్తానని అన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులను ప్రజలు బలపరిచి అఖండ మోజార్టీని ఇవ్వాలని విన్నవించారు. బీకే ప్రచారంలో అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు.



పెనుకొండ నియోజకవర్గం మల్లాపల్లిలో బీకే ప్రచారం

కూటమి అభ్యర్థులను గెలిపించండి

ఎమ్మార్పీఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మందకృష్ణ మాదిగ

అనంతపురం అర్బన్, మే 6: టీడీపీ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. వైసీపీ పాలనలో మాదిగలతోపాటు అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఏపీని రాజధానిలేని రాష్ట్రంగా జగన్ మార్చారని విమర్శించారు. ప్రజల అస్తిత్వం, ఆత్మగౌరవం, అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

జగన్ మాటలను నమ్మొద్దు: అంబికా

జగన్ మాటలు నమ్మి మోసపోవద్దని టీడీపీ కూటమి అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ దళిత ఓటర్లను కోరారు. గత ఎన్నికల్లో ఓట్లు వేసిన పాపానికి దళితులపై దాడులకు తెగబడుతున్నారన్నారు. దళిత ద్రోహి జగన్‌ను ఇంటికి పంపాలని కోరారు. చంద్రబాబు మళ్లీ సీఎం అయితేనే దళితులతోపాటు అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

- జగన్ ప్రభుత్వంలో దళితులే ఎక్కువగా నష్టపోయారని ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ అన్నారు. ఐదేళ్లల్లో దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలతో వైసీపీవారు పేట్రేగిపోయారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించిన దుర్మార్గుడు జగన్ అని మండిపడ్డారు. మాదిగలు జగన్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే జిల్లాలవారీగా వర్గీకరణ చేసి, మాదిగలకు న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ, ఎమ్మార్పీఎస్ నాయకులు మధు, కదిరప్ప, నాగార్జున, టీడీపీ నాయకులు సరిపూటి రమణ, రాయల్ మురళి, వెంకటేష్, శివకుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ



నీవే..దిక్కు... మీట..నొక్కు..!



రాష్ట్రంలో మలివిడత ఓట్ల పండుగకు సర్వం సిద్ధమైంది. ఉత్తరకర్ణాటక పరిధిలోని 14 లోక్‌సభ స్థానాలకు మంగళవారం పోలింగ్ జరగనుంది. సోమవారం అన్ని నియోజకవర్గాలకు ఈవీఎంలను తరలించారు. నెల రోజులుగా మండుటెండలతో అట్టుడికిన ఉత్తరకర్ణాటక ప్రాంతంలో వాతావరణంలో మార్పు చోటు చేసుకోవడంతో అందుకు అనుగుణంగానే ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు. 14 నియోజకవర్గాలకు సంబంధించి 227మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అభ్యర్థుల జాతకాలు తేలనుంది.

ఆంధ్రజ్యోతి, బెంగళూరు



ఈవీఎంలను పరిశీలిస్తున్న అధికారులు



శివమొగ్గ - రాఘవేంద్ర (బీజేపీ) | గీతా శివరాజ్‌కుమార్ (కాంగ్రెస్) | ఈశ్వరప్ప (స్వతంత్ర) | దావణగెరె - గాయత్రి సిద్దేశ్వర్ (బీజేపీ) | ప్రభా మల్లికార్జున్ (కాంగ్రెస్)



హావేరి -బసవరాజ్ బొమ్మై (బీజేపీ) | ఆనందస్వామి గడ్డదేవరమఠ(కాంగ్రెస్) | ఉత్తరకన్నడ విశ్వేశ్వర హెగ్డే కాగేరి (బీజేపీ) | అంజలి నింబాల్కర్ (కాంగ్రెస్) | బళ్ళారి ఈ.తుకారాం (కాంగ్రెస్) | శ్రీరాములు(బీజేపీ) | రాయచూరు - రాజా అమరేశ్వరనాయక (బీజేపీ) | కుమార్ నాయక్ (కాంగ్రెస్) | బీదర్ - భగవంత్ ఖూబా(బీజేపీ) | సాగర్ ఖండ్రె (కాంగ్రెస్) | ధారవాడ - ప్రహ్లాద్ జోషి(బీజేపీ) | వినోద్ అసోటి (కాంగ్రెస్)



బెళగావి -జగదీశ్ శెట్టర్ (బీజేపీ) | మృణాల్ హెబ్బాల్కర్ (కాంగ్రెస్) | చిక్కోడి - ఆనంద్ అసోటి (బీజేపీ) | ప్రియాంక జార్కిహొళి (కాంగ్రెస్) | బాగల్కోట్ - పీసీ గద్దిగౌడర్ (బీజేపీ) | సంయుక్తా పాటిల్ (కాంగ్రెస్) | కలబురగి - ఉమేశ్ జాధవ్ (బీజేపీ) | రాధాకృష్ణ దొడ్డమని (కాంగ్రెస్) | విజయపుర - రమేశ్ జిగజిణగి(బీజేపీ) | రాజు అలగూర (కాంగ్రెస్) | కొప్పళ - రాజశేఖర హిట్నాల్ (కాంగ్రెస్) | బసవరాజ క్యావటూర్ (బీజేపీ)

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

రవీంద్రనాథ్ ఠాగూర్ (జయంతి)



దేశ జాతీయగీతం 'జనగణమన' రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ 1861 మే 7న కోల్కత్తా ప్రాంతంలో జన్మించారు. 'గురుదేవ్'గా పేరొందారు. బంగ్లాదేశ్ జాతీయ గీతాన్ని, శ్రీలంక జాతీయ గీతాన్ని ఆయనే రచించారు. కవి, రచయిత, నాటక రచయిత, స్వరకర్త, తత్వవేత్త, చిత్రకారుడు, సంఘసంస్కర్తగా బహుముఖ ప్రజ్ఞాశాలి. 1913లో గీతాంజలి రచనకు 'నోబెల్ పురస్కారం' అందుకున్న తొలి ఆసియావాసి. నవలలు, వ్యాసాలు, చిన్న కథలు, వేలసంఖ్యలో పాటలు రాశారు. విశ్వకవి బిరుదు పొందారు. గురుకులం తరహాలో చిన్నారుల వికాసానికి శాంతి నికేతన్ నెలకొల్పారు. 1941 ఆగస్టు 7న కన్నుమూశారు.

గ్రే కూపర్ (జయంతి)



అమెరికాకు చెందిన నటుడు గ్రే కూపర్ 1901 మే 7న జన్మించారు. 1925 నుంచి 1961 వరకు 84 సినిమాలలో ప్రధాన పాత్రలలో పోషించారు. క్లాజికల్ హాలీవుడ్‌లో 'స్టార్ హీరో'గా పేరొందారు. ఉత్తమ నటుడిగా రెండుసార్లు అకాడమీ అవార్డు పొందగా, మూడుసార్లు నామినేట్ అయ్యారు. 23ఏళ్లపాటు వరుసగా టాప్-10 సినీ నటులలో ఒకరిగా నిలిచిన రికార్డు ఉంది. 1961 మే 13న కన్నుమూశారు.

ఆచార్య ఆత్రేయ (జయంతి)



'మనసు కవి'గా పేరొందిన ఆచార్య ఆత్రేయ అసలు పేరు కిళాంబి వెంకట నరసింహాచార్యులు 1921 మే 7న నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేట మండలంలో జన్మించారు. గొప్ప వేదాంతి. తెలుగులో నాటక, సినీ పాటల, మాటల రచయిత, నిర్మాత, దర్శకులు. దాదాపు 400 సినిమాలకు పాటలు, మాటలు రాసిన కవి. విశ్వశాంతి నాటకానికి రాష్ట్రస్థాయి పురస్కారం దక్కింది. నటుడు కొంగర జగ్గయ్యకు ఆప్తమిత్రుడు. ఆత్రేయ రాసిన పాటలు, నాటకాలు, నాటికలు, కథలు మొదలగు రచనలను ఏడు సంపుటాలలో సమగ్రంగా ప్రచురించి మిత్రుడు 'జగ్గయ్య'కు గొప్ప నివాళి అర్పించారు. గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 1989 సెప్టెంబరు 13న స్వర్గస్తులయ్యారు.

చేమంతి పూల తోటకు నిప్పు

శిడ్లఘట్ట, మే 6: తాలూకాలోని కణప్పనహళ్ళి గ్రామంలో వెంకటేశప్పకు చెందిన ఒక ఎకరా చేమంతి పూల తోటకు గుర్తు తెలియని దుండగులు నిప్పం టించారు. ప్రస్తుతం మార్కెట్‌లో చేమంతి పూలకు మంచి ధర ఉంది. కిలో రూ.300 నుంచి 350వరకు పలుకుతోంది. వేసవిలో నీటి ఎద్దడి ఉన్నా ఎలాగో అలా శ్రమించి పంట పండిస్తే కోత దశలో ఉన్న పూలతోటకు దుండగులు నిప్పంటించడంతో తీవ్రంగా నష్టపోయినట్టు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పక్కన నీలగిరి తోటకు నిప్పంటించగా దాని ప్రభావం పూలతోటపై పడింది. అధికారులు న్యాయం కల్పించాలని రైతు కోరుతున్నారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా నష్టాలు ఎదుర్కొనడమే కాక ఇలాంటి ఘటనల్లో నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని రైతాంగం కోరుతోంది.

పశువులకు నీరు, గ్రాసం కొరత

» గడ్డి బ్యాంకుల ఏర్పాటుకు డిమాండ్

బాగేపల్లి, మే 6: తాలూకాలో నీటి సమస్య రోజురోజుకు అధికమవుతోంది. జలమూలాలైన చెరువులు, నది, బావులు, బోరుబావులు ఎండిపోయాయి. దీంతో ప్రజలకే కాకుండా పశుపక్షాదులు సైతం తాగునీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. తాలూకాలో 39-40 డిగ్రీల సెల్సియస్ నమోదవుతోంది. గోమాళ, పొలాలు, చేను, చెరువుకట్ట ప్రదేశాలు, కొండగుట్ట సహా పచ్చటి గడ్డి కరువైంది. దీంతో మేత కోసం పశువులు అల్లాడుతున్నాయి. ఆవులకు పచ్చగడ్డి లేక పోవడంతో పాల దిగుబడి కూడా తగ్గింది. ఇలాంటి తరుణంలో పశువుల పెంపకం పాడి రైతులకు సవాల్‌గా మారింది. దీంతో పశువులను మధ్యాహ్నం వేళ ఎక్కడైనా చెట్లకింద ఆశ్రయం కల్పిస్తూ ఎండ తగ్గాక మేతకు తీసుకెళ్తున్నారు. తాలూకాలో మేత విషయంలో కొంతమేర నిభాయిస్తున్నా నీటి కొరత అధికంగా ఉంది. పశువులు తక్కువగా ఉండడంతో ఇంతవరకు గడ్డిబ్యాంకులు ఏర్పాటు చేసే అవసరం రాలేదు. 15రోజుల్లోగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించింది. తాలూకాలోని రైతులు, పాడి పెంపకందారులకు గడ్డిగింజలు పంపిణీ చేసినట్టు పశుసంవర్ధకశాఖ సహాయక డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి వెల్లడించారు. కాగా రైతుసంఘం, హసిరుసేన తాలూకా అధ్యక్షుడు గోవిందరెడ్డి మాట్లాడుతూ కరువు దృష్ట్యా పశువులను కాపాడుకునేందుకు గడ్డిబ్యాంకు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.



కనుచూపుమేర పచ్చగడ్డి కొరత

ఆంజనేయస్వామి ఆలయ ఉట్ల ఉత్సవం



విశేషపూజల్లో పాల్గొన్న భక్తులు

శిడ్లఘట్ట, మే 6: తాలూకాలోని పట్టపల్లి గ్రామంలో బయలాంజనేయస్వామి ఆలయ ఉత్సవాలలో ఉట్ల ఉత్సవం ప్రముఖమైనది. స్వామికి మొక్కులు ఉన్నవారు టెంకాయను ఉట్టిగా కట్టి అనంతరం కర్రలతో కొట్టడం ద్వారా కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. గ్రామానికి చెందిన ప్రముఖులు దేవరాజు స్వామివారిని దర్శించిన అనంతరం మాట్లాడుతూ భక్తుల కొంగుబంగారంగా స్వామివారి ఉన్నారన్నారు. ప్రాచీన దేవాలయాలలో ఇదొకటన్నారు. పవిత్రంగా నియమనిష్టలతో దేవుడికి మొక్కులు సమర్పించుకుంటున్నవారు ఎందరో ఉన్నారన్నారు. ప్రత్యేకించి శ్రావణ శనివారాలలో ఇక్కడ స్వామివారికి విశేషపూజలు ఉంటాయన్నారు. తాలూకా ఒక్కలిగ సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి మాట్లాడుతూ 60వ ఉట్ల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగుతోందన్నారు. గతంలో కలరా, ప్లేగు వంటివి ప్రబలినప్పుడు ఊరంతా ఖాళీ అయ్యిందని అయితే దేవాలయం మాత్రం ఎలాగో కొనసాగిందన్నారు. ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్, ఆయన సోదరుడు సచిన్ మాట్లాడుతూ ఈ ఏడాది మంచి వర్షాలు కురవాలని ప్రార్థించామన్నారు. భక్తులందరిపై స్వామివారి కృప ఉండాలని ఆకాంక్షించారు. మధ్యాహ్నం 2 గంటలకు పండరి భజన, అనంతరం వరదనాయకనహళ్ళి గ్రామస్తులచే ప్రసాద వినియోగం చేశారు. రాత్రి 8 గంటలకు ఆలయ కార్యక్రమ సమితిచే భక్త ప్రహ్లాద నాటక ప్రదర్శన జరిగింది. డ్రామా మాస్టర్ శ్రీరామప్ప, ఉమాశంకర్, ఎంబి లక్ష్మణప్ప, పీవీ నారాయణప్ప, తాతళ్ళి గోపాలప్ప, వరదనాయకనహళ్ళి రాధాకృష్ణ, నరసింహమూర్తి, జయమ్మ, అశ్వతప్ప, మంజునాథ, రామకృష్ణప్ప, మునేగౌడ హనుమంతపుర చంద్రేగౌడ తదితరులు పాల్గొన్నారు.

ఐసీఎస్ఈ ఫలితాల్లో

హోలి ఏంజల్స్ విద్యార్థుల సత్తా

బెంగళూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఐసీఎస్ఈ 2023-24 పదో తరగతి ఫలితాల్లో విజయనగర అనుబంధమైన హంపినగర్‌లో ఉన్న హోలి ఏంజల్స్ హైస్కూల్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల ప్రిన్సిపాల్ లోకేశ్, డైరెక్టర్ చంద్రమోహన్‌లు సోమవారం మీడియాతో మాట్లాడుతూ 173మంది విద్యార్థులకు గాను 21మంది డిస్టింక్షన్‌లోనూ, 90మంది ఫస్ట్‌క్లాస్‌లోనూ, 20మంది, 42 మంది వివిధ విభాగాల్లో ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. మొత్తమ్మీద 85శాతం కంటే ఎక్కువగా 30మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారని అభినందించారు. పూర్వి పి చురి (98.40శాతం), ఆకాశ్ పి పాటిల్ (97.60), ప్రణవ్ హెచ్ (96.80), దిశ (95.60), కౌశిక్ కుందర్ (95.40), రాబిన్ కుమార్ (94.80), ఇంచర ఎంఎస్ గౌడ (94.00), వికాస్ హెచ్ (93.80), రిశంక్ ఏ ఆర్ (93.60), పుణ్యశ్రీ హెచ్‌డి (93.40), శ్రేయ వి (93.40), కృష్ణ (92.60)శాతంతో ఉత్తీర్ణత సాధించారని వివరించారు. వందశాతం ఉత్తీర్ణతపై హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు.



ట్రాఫిక్ వార్డెన్ నిజాయితీ

» పర్సు వాపసుపై ప్రశంసలు



పర్సు అందజేస్తున్న వార్డెన్

బెంగళూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): లాల్‌బాగ్ వెస్ట్‌గేట్ వద్ద ట్రాఫిక్‌వార్డెన్‌గా వ్యవహరించే మల్లేశ్‌కు సోమవారం లభించిన పర్సును వాపసు చేశారు. ఉదయం వాకింగ్‌కు వచ్చిన ఓ వ్యక్తి నగదుతోపాటు వివిధ ఏటీఎం కార్డులు ఉన్న పర్సును పోగొట్టుకున్నారు. సదరు పర్సు ట్రాఫిక్ వార్డెన్ మల్లేశ్‌కు లభించింది. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చి అందులోని ఆధారాల ప్రకారం సంబంధిత వ్యక్తిగా అప్పగించారు. వార్డెన్ కార్యవైఖరిపై ప్రశంసలు వ్యక్తం అయ్యాయి.


పశువుల సంతలో సదుపాయాలు కల్పించండి

చేళూరు, మే 6: తాలూకా కేంద్రమైన చేళూరులో ప్రతి శుక్రవారం పశువుల సంత జరుగుతుంది. స్థానికంగా జరిగే అతి పెద్ద పశువుల సంత ఇదేనని చెప్పవచ్చు. సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలనుంచి గొర్రెలు, మేకలే, ఆవులు ఇతరత్రా తీసుకుని వస్తుంటారు. చుట్టుపక్కల వారే కాక బెంగళూరు నుంచి కూడా వ్యాపారస్తులు వచ్చి పశువులను కొనుగోలు చేస్తుంటారు. సంతగేట్ రూపంలో పన్ను బాగానే వసూలు చేస్తున్నప్పటికీ ఆ మేరకు సంత ప్రదేశంలో తగినన్ని మౌలిక సదుపాయాలు లేవని రైతులు, వ్యాపారస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పశువుల సంత ప్రదేశాన్ని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

పవర్ లేని పదవులు..!

- వైసీపీ పాలనలో ఉత్సవ విగ్రహాలుగా ప్రజాప్రతినిధులు
- మూడేళ్లు గడిచినా నిధుల్లేవు.. విధుల్లేవు..

చిలమత్తూరు: గ్రామీణ ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతో ఎన్నికల్లో గెలిచిన స్థానిక ప్రజా ప్రతినిధులకు వైసీపీ ప్రభుత్వ హ యాంలో తీవ్ర అన్యాయం జరిగింది. తమ పరిధిలోని ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలన్న వారి ఆశలపై వైసీపీ ప్రభుత్వం నీళ్లు చల్లింది. ఎన్నికై మూడేళ్లు కావస్తున్నా నిధులు...విధులూ లేకపోవడంతో ఆ పార్టీలోని ప్రజాప్రతినిధిలే తీవ్ర నిరాశకు గురయ్యారు. కనీసం ప్రభుత్వ కార్యాలయాల్లో గౌరవమైనా దక్కుతుందనుకుంటే అదీ లేకుండాపోయింది. దీంతో విజయం సాధించామన్న సంతోషం కంటే.. ప్రజలకు ఏమీచేయలేకపోతున్నామనే బాధే వారిలో ఎక్కువగా కనపడుతోంది. 2021 ఫిబ్రవరి 21న పంచాయతీలకు, అదే ఏడాది ఏప్రిల్ 8న ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో చిలమత్తూరు మండలంలోని 12 పంచాయతీలకు 11 పంచాయతీలు, 15 ఎంపీటీసీ స్థానాలకు 15 ఎంపీటీసీ స్థానాలను అధికార పార్టీ దక్కించుకుంది.




నిధులు లేవు.. విధులూ లేవు

గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలుగా గెలిచి మూడేళ్ళవుతున్నా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేకపోయారు. నిధులు లేవు...విధులు లేవు. గ్రామ సచివాలయ వ్యవస్థ రావడంతో ప్రజలతో ఎన్నికైన ప్రజాప్రతినిధులకు పని లేకుండా పోయింది. ప్రతీది వారి ద్వారా జరుగుతుండటంతో పంచాయతీ కార్యాలయాల్లో దిష్టిబొమ్మలా కూర్చోవడం తప్పా చేసేదేమి లేదని పలువురు పేర్కొంటున్నారు. ఎంపీటీసీల పరిస్థితి మరీ ఘోరంగా మారింది. వారికి విధులు లేవూ...నిధులూ లేవు. కనీసం పంచాయతీ కార్యాలయంలో కూర్చుందామంటే వారికి ప్రత్యేకమైన కుర్చీ కూడా లేదు. మండల పరిషత్ సమావేశాల్లో ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లినా వాటిని పరిష్కరించిన దాఖలాలు లేవు. నిధుల జాడ లేక ఎంపీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు.

పదవి ఉన్నా లేనట్లే..

మండల పరిషత్‌కు గతంలో బీఆర్‌జీఎఫ్ తలసరి గ్రాంట్, జనరల్ ఫండ్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, 14వ ఆర్థిక సంఘం నిధులు సమకూరేవి. దీంతో గ్రామాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు చేపట్టేవారు. ప్రస్తుతం నిధులు ఎంపీటీసీల ప్రమేయం లేకుండా నేరుగా గ్రామ పంచాయతీలకు ఇస్తుండటంతో వారికి కనీస గౌరవం కూడా లేకుండా పోయింది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 20 శాతం ఎంపీటీసీలకు ఇవ్వాల్సిందిగా కేంద్రం సూచించినా రాష్ట్రం ఇవ్వడం లేదు. ఎంపీటీసీలకు నిధుల వాటా 25 శాతం పెంచాలన్న విజ్ఞప్తిని పట్టించుకోలేదు. ప్రత్యేక నిధులు కేటాయిస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటన చేసినప్పటికీ విడుదల చేయడం లేదు. దీంతో వైసీపీ ప్రభుత్వంలో సర్పంచులు, ఎంపీటీసీలు పదవి ఉన్నా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోతున్నామని వాపోతున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.84	1,575.52
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	138	234
సామర్థ్యం (టీఎంసీలు)	3.51	2.67

వడగాల్పులతో జాగ్రత్త



డీహెచ్‌ఓ రమేశ్‌బాబు

బళ్లారి సిటీ, మే 6: తీవ్రమైన ఎండలతో ప్రజలు వడగాల్పులకు లోనై అనారోగ్యానికి గురవుతున్నారని డీహెచ్‌ఓ రమేశ్‌బాబు తెలిపారు. ముందు జాగ్రత్తలతో రక్షించుకోవడమే మేలని అన్నారు. భూతాపం కారణంగా రాష్ట్రంలో ఈ వేసవిలో గతంలో ఎన్నడూ లేనంతగా తీవ్రమైన ఎండలు కాస్తున్నాయన్నారు. వడదెబ్బ నుంచి ఉపశమనానికి ప్రతి ఒక్కరూ అధిక మోతాదులో ద్రవ పదార్థాలను, శుద్ధమైన తాగునీటిని అధిక ప్రమాణంలో తాగాలన్నారు. మజ్జిగ, కొబ్బరి బొండాలు, నిమ్మరసం తరచుగా తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఓఆర్ఎస్ ద్రవాన్ని వాడాలన్నారు. పగటి పూట సాయంకాలం 4గంటలకు వరకు ప్రజలు బయట తిరుగురాదన్నారు. అత్యవసర పరిస్థితిలో గొడుగు, వాటర్ బ్యాటిల్ వెంట తీసుకెళ్లాలన్నారు.

వీధి కుక్కలను తప్పించుకోబోయి బాలుడి మృతి..!

రాయచూరు, మే 6 : సింధనూరు నగరంలోని నటరాజ్ కాలనీకి చెందిన పృథ్వీ(10) సోమవారం వీధి కుక్కలు వెంటబడడంతో మృత్యువాతపడ్డాడు. ఇంట్లో నుంచి ఆడుకునేందుకు బయటికి వెళ్లిన బాలుడిని వీధి కుక్కలు వెంబడించడంతో వాటిని తప్పించుకునే క్రమంలో వెనకముందు చూడకుండా పరుగెత్తాడు. ఈ క్రమంలో ఒక డ్రైనేజిలోకి పడిపోయాడు. బాలుడికి గాయాలవవడంతో ఆయాసపడుతూ ఒక్కసారిగా మాటలు రాకుండా మూగబోయాడు. దీనిని గమనించిన ఇరుగుపొరుగు వారు వెంటనే బాలుడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృత్యువాతపడ్డాడు. ఈ హఠాత్ పరిణామంతో నగరంలోని ప్రజలు హతాశులు కాగా తల్లిదండ్రుల రోదన చూపరులను కలిసివేసింది.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్



మాట్లాడుతున్న జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్

కంప్లి, మే 6 : లోక్‌సభ ఎన్నికల విధులలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఉపాధ్యాయులను విజయనగర జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ సస్పెండ్ చేశారు. 19వ బూత్ నెంబర్ వడ్రహట్టి సిద్దాపురం గ్రామానికి చెందిన పాఠశాల ఉపాధ్యాయురాలు సునంద న్యామతి, 120వ బూత్ బీఎల్వో గుండుమణుగు పాఠశాల ఉపాధ్యాయురాలు మమతలు ఇరువురిని ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం చేయడంతో సస్పెండ్ చేశారు. ఎన్నికల సమయంలో తమ విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా విధులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ తెలిపారు.

నేడు పోలింగ్‌కు సర్వం సిద్ధం



- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకూ ఓటింగ్
- బళ్లారి నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓటర్లు 18,84,469 మంది
- పోలింగ్ కేంద్రాల సంఖ్య1,219

బళ్లారి, మే 5(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నిక పోలింగ్ మరికొద్ది సేపట్లో ప్రారంభం కానుంది. ఇందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరుగుతుంది. పోలింగ్ బూత్‌ల వద్ద క్యూలో ఉండే ఓటర్లు పూర్తి అయ్యేంత వరకూ పోలింగ్ కొనసాగిస్తామని ఎన్నికల కమీషన్ పేర్కొంది.

బళ్లారి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మొత్తం 18,84,469 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళా ఓటర్లు 9,54,929 మంది, పురుషులు 9,29,274 మంది ఉన్నారు. వీరిలో తొలిసారిగా ఓటు హక్కు వినియోగించే యువతీయువకులు 61,006 మంది ఉండడం విశేషం.

జిల్లాలో 1,219 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. బళ్లారి నగరంలో 261, బళ్లారి రూరల్‌లో 235, కంప్లిలో 242, సండూరులో 253. విజయనగర 259, హగరిబొమ్మణహళ్లిలో254, హడగలిలో 215, పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు 5952 మంది సిబ్బందిని నియమించారు. 1.395 మంది పీఆర్‌వో, 1395 ఏపీఆర్‌వో, 2790 మంది పీవో, 372 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు.

మొత్తం 2148 మంది పోలీస్ సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు. ఓటర్లు, నాయకులు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ఎస్పీ రంజింత్‌కుమార్ కోరారు. ఎవరైనా పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బంది కలిగించేందుకు ప్రయత్నిస్తే, ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చారించారు.

పోటీలో ఉన్న అభ్యర్థులు వీరే

నియోజకవర్గంలో ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు రంగంలో ఉన్నారు. కాంగ్రెస్ తరఫున తుకారాం పోటీలో ఉండగా, బీజేపీ తరఫున మాజీ మంత్రి బి.శ్రీరాములు పోటీచేస్తున్నారు. రంగంలో ఎస్‌యూసీఐ నుంచి ఒకరు, ఇంకా మరి కొందరు ఇండిపెండెంట్లు ఉన్నప్పటికీ పోటీ మాత్రం వీరిద్దరి మధ్యే నెలకొంది. ఇప్పటికే వీరి తరఫున ప్రధాన ప్రచారకర్తలు రాహుల్‌గాంధీ, నరేంద్రమోదీ వచ్చి ప్రచారం చేసి వెళ్లారు. నువ్వా నేనా అనే రీతిలో సాగిన ప్రచారంలో ఇరుపార్టీలు ఓటర్లను ఆకర్షించడానికి ఎంతో కృషిచేశాయి. వీరిలో ఎవరి అదృష్ట మెలాఉందో మంగళవారం పోలింగ్‌లో తేలనుంది.



కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం



బీజేపీ అభ్యర్థి శ్రీరాములు

జపానంద స్వామి ఆస్పత్రిని సందర్శించిన డీజీపీ



జపానంద ఆస్పత్రికి ఛత్రీ పంపిణీ చేస్తున్న డీజీపీ

పావగడ, మే 6: పావగడ వివేకానంద ఆరోగ్య సంస్థ శ్రీశారదాదేవి కంటి ఆస్పత్రి పరిశోధన కేంద్రాన్ని కర్ణాటక పోలీసు డైరెక్టర్ డాక్టర్ రవికాంత్‌గౌడ సోమవారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చేసే సేవలు, చికిత్సా వ్యవస్థల గురించి ఆయన తెలుసుకున్నారు. ఇతర వివరాలను జపానంద స్వామిని ఆయన అడిగి తెలుసుకొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రతకు భయపడుతున్న పావగడ వాసులకు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవాలో ఆయన వివరించి చెప్పారు. ఈ అంశంపై ఆస్పత్రికి ఆయన వివరించి చెప్పారు. రెండు ఖాళీ కుర్చీలు, రెండు పెద్ద గొడుగులను ఆస్పత్రికి కానుకగా ఇచ్చి జపానంద స్వామి ఆశీస్సులు పొందారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్, హైకోర్టు లాయర్ హొన్నప్ప, డాక్టర్ వెంకటరామయ్య, ఆస్పత్రి సిబ్బంది హాజరయ్యారు.

ఓటర్లను ఆకర్షిస్తున్న ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు

బళ్లారి సిటీ, మే 6: లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలు మంగళవారం జరగనున్న నేపథ్యంలో విజయనగరం జిల్లాలో 25సఖి పోలింగ్ కేంద్రాలు, ఐదు యూత్ పోలింగ్ కేంద్రాలు, ఐదు మోడలింగ్ పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటువేయమని ప్రజలను ప్రోత్సహించడానికి ఐదు మిషన్ ఆధారిత పోలింగ్ కేంద్రాలు, మిగతా జిల్లా వ్యాప్తంగా సాంప్రదాయక పోలింగ్ బూత్‌లను ఏర్పాటుచేశారు.



హొసపేటలో ఓటర్లను ఆకర్షిస్తున్నపోలింగ్ బూత్

హగరిబొమ్మనహళ్ళి తాలూకా మరియమ్మనహళ్ళి పట్టణ పంచాయితీ కార్యాలయంలోని పోలింగ్‌బూత్ నంబర్ 61, హొసపేట విద్యుత్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ బూత్ నంబర్ 147 ను చిత్రపటాల ద్వారా సిద్ధం చేశారు. కూడ్లిగి పట్టణంలోని పోలింగ్ బూత్ నంబర్ 35లో బాలల విద్య, డాక్టర్, ఇంజనీరింగ్ తదితర ఉన్నత విద్యారంగాల గురించి కలలు కంటున్న బాలకార్మిక నిర్మూలనపై వేసిన చిత్రాలు ఆకర్షిస్తున్నాయి. అటవీ పర్యావరణ పరిరక్షణకు సంబంధించి సామాజిక, ప్రాంతీయ అటవీ శాఖ సహకారంతో చిత్రలేఖనం అందరినీ ఆకర్షిస్తోంది. అటవీశాఖ సహకారంతో హరపనహళ్ళి పట్టణం 93వ నంబర్ పోలింగ్ బూత్‌లో పెయింటింగ్స్, నాటిన మొక్కలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. మే 7న నిర్వహించే ఎన్నికలలో ప్రత్యేకంగా ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు వేయాలని జిల్లా పంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సదాశివ ప్రభు విజ్ఞప్తిచేశారు.

ఐసీఎస్సీలో శ్రీనంది రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థుల సత్తా



అమోఘ, లీలావతి, రంగనాథ్, అంకిత, నితిన్, వినయ్,

బళ్లారి సిటీ,మే 6: 2023-24 సంవత్సరానికి గాను ఐసీఎస్సీలో శ్రీనంది రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణులయ్యారని పాఠశాల హెడ్‌మాస్టర్ గోవిందరెడ్డి తెలిపారు. మొత్తం 27మంది పరీక్ష వ్రాయగా అందులో డిస్టింక్షన్‌లో 12మంది, ఫస్ట్ క్లాస్‌లో 13మంది, సెకండ్ క్లాస్‌లో ఇద్దరు ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను చైర్మన్ రవి రెడ్డి, గోవిందరెడ్డి, ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందించారు.

రాకపోకలకు అంతరాయంగా స్పీడ్ బ్రేకర్లు



దరోజీ చెరువు వద్ద ఎత్తుగా వేసిన స్పీడ్ బ్రేకర్ ఇది

కంప్లి, మే 6 : కుడితిని పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త దరోజీ, పాత దరోజీ చెరువు మలుపు వద్ద వేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రయాణానికి అంతరాయం కలిగిస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. గత కొన్ని రోజుల క్రితం దేవలాపురంకు చెందిన దేవరాజు అతివేగంతో స్తంభానికి ఢీకొని మృతి చెందడంతో పోలీసు అధికారులు, పీడబ్ల్యూడీ శాఖ అధికారులు మలుపు వద్ద అతివేగాన్ని నివారించడానికి సుమారు ఎనిమిది స్పీడ్ బ్రేకర్లు వేశారు. అరకిలోమీటర్లో ఎనిమిది స్పీడ్ బ్రేకర్లు వుండటంతో పూర్తిగా ప్రయాణానికి అంతరాయం కలుగుతోందన్నారు. కేవలం మలుపు వద్ద రెండు స్పీడ్ బ్రేకర్లు వుంచి మిగతావాటిని తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రజ్వల్, రేవణ్ణ దిష్టిబొమ్మల దహనం



గడిగి చెన్నప్ప సర్కిల్లో దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ సభ్యులు

బళ్లారి సిటీ, మే 6: అమాయక మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన జేడీయస్ నేతలను శిక్షించాలని కోరుతూ నగరంలోని గడిగి చెన్నప్ప సర్కిల్లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ప్రజ్వల్ రేవణ్ణ, రేవణ్ణ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ. శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడిన ప్రజ్వల్‌ను వెంటనే శిక్షించాలని లేకుంటే రాబోయే రోజుల్లో పెద్దఎత్తున పోరాటం చేస్తామన్నారు. ఈసందర్భంగా బళ్లారి నగర జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, కాంగ్రెస్ ప్రముఖ నాయకులు, మహిళానాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కంప్లి సర్కిల్లో 242 పోలింగ్ కేంద్రాలు



దేవసముద్రం పోలింగ్ కేంద్రం వద్ద షామియానా ఏర్పాటు చేసిన దృశ్యం

కంప్లి, మే 6 : కంప్లి నియోజకవర్గంలో 242 బూత్‌లు వున్నాయి. అందులో కంప్లి తాలుకాలో 105, కురుగోడులో 95, బళ్లారి తాలుకాలో 40, రెండు అదనపు పోలింగ్ బూత్‌లు మొత్తం 242 పోలింగ్‌బూత్‌లు వున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటర్ల సౌకర్యార్థం షామియానా, నీటి సౌకర్యం, వైద్య సదుపాయంలను ఏర్పాటు చేశారు. అలాగే అధికారులు కూడా ఈవీఎంలతో ఆయా కేంద్రాలకు తరలివచ్చారు. పోలింగ్ సిబ్బంది కూడా ఆయా కేంద్రాలకు తరలివెళ్లారు. ఇప్పటికే సూక్షాతి సూక్ష్మ కేంద్రాలలో కూడా ఎలాంటి సంఘటనలు జరుగకుండా పూర్తి బందోబస్తు ఏర్పాటు చేశామని ఏఆర్‌వో శివకుమార్ తెలిపారు.



ఈవీఎంలతో పోలింగ్ బూత్‌ల వద్దకు వస్తున్న అధికారులు

హొసూరు జోన్

పెరియార్ ఆశయాలు ఆదర్శప్రాయం



పెరియార్ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పిస్తున్న ఎమ్మెల్యే, మేయర్ తదితరులు

హొసూరు(సిఫ్‌కాట్), మే 6: ద్రావిడ ఉద్యమ పితామహగా పేరొందిన పెరియార్ ఆశయాలు నేటికీ ఆదర్శనీయమని డీఎంకే జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే వై ప్రకాశ్ పేర్కొన్నారు. ఆత్మగౌరవ ఉద్యమ శతాబ్దిగా 1925-2024ను జరుపుకుంటున్నట్టు పేర్కొన్నారు. హొసూరు రాంనగర్‌లోని అన్నా విగ్రహం వద్ద సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు వనవేందన్ అధ్యక్షత వహించారు. తొలుత పెరియార్ (ఈరోడ్ వెంకట రామస్వామి) చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సైతం పెరియార్ సిద్ధాంతాలను పాటిస్తున్నారని, మేమూ కూడా వారిబాటలోనే కొనసాగుతున్నామన్నారు. రాష్ట్ర మహిళా కార్యదర్శి తగడూరు తమిళసెల్వి ప్రారంభోపన్యాసం, రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నా శరవణన్, చీఫ్ క్లబ్ స్పీక్టర్ కాంజీకదిరవన్ ముఖ్య ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో డీఎంకే మేయర్ సత్య, ముఖ్య కార్యవర్గ సభ్యుడు ఎల్లోరమణి, నగర ఆరోగ్య కమిటీ అధ్యక్షుడు మాదేశ్వరన్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు త్యాగరాజన్, ద్రావిడ ఉద్యమ రచయిత వనంగాముడి తదితరులు పాల్గొన్నారు.

పాన్ నంబరును అప్‌డేట్ చేసుకోవాలి

హొసూరు (కృష్ణగిరి), మే 6: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు తమ పాన్ నంబర్‌ను అప్‌డేట్ చేసుకోవాలని ఈమేరకు కృష్ణగిరి జిల్లా ట్రెజరీ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కెఎం సరయు తెలిపారు. ఆదాయపు పన్ను కృష్ణగిరి జిల్లా ట్రెజరీ యూనిట్ రిపోజిటరీ ఆదాయపు పన్ను ఆటో గణనను అమలు చేసింది. మే 10 లోపు ఉద్యోగులు ఎంప్లాయీస్ ప్రొఫైల్‌లో పాన్ నంబర్‌ను అప్‌డేట్ చేయాల్సి ఉంటుందన్నారు. పాత పాలనను ఎంచుకున్న ఉద్యోగులు తమ పొదుపు వివరాలను (జీపిఎఫ్, సిపిఎస్, ఏజన్ ఎస్‌పిఎఫ్, ఎన్‌పిఎస్, ఎఫ్‌బిఎఫ్) విరాళం ద్వారా మే 10లోపు ఐఎఫ్‌హెచ్‌ఆర్ఎంఎస్ లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. విఫలమైతే ఆదాయపు పన్ను ఆటో లెక్కింపు పద్ధతి ద్వారా మినహాయింపుజరుగుతుందన్నారు. పే రోల్ రన్ తర్వాత తీసివేయబడిన ఐటీ మొత్తాన్ని మార్చలేదని, ప్రభుత్వ ఉద్యోగులు చెల్లింపు, పంపిణీ కార్యాలయాన్ని సంప్రదించడం ద్వారా అందరూ ఐఎఫ్‌హెచ్‌ఆర్ఎంఎస్ సాఫ్ట్‌వేర్‌లో పై వివరాలను అప్‌డేట్ చేయాలన్నారు. పెన్షనర్ల పోన్, ఇ-మెయిల్ ద్వారా వారి టెజరీ కార్యాలయాన్ని సంప్రదించడం ద్వారా ఆదాయపు పన్ను పాన్ నంబర్‌ను నవీకరించాలని కోరారు. జిల్లా ట్రెజరీ కృష్ణగిరి పెన్షనర్లు ఇమ్రాన్, సూపరింటెండెంట్ పాన్ నంబర్‌ను అప్‌డేట్ చేయడానికి 9788476647ను సంప్రదించాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

హొసూరు, మే 6: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో హొసూరు బస్ స్టేషన్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసింది. కృష్ణగిరి జిల్లా హొసూరు చుట్టు పక్కల ప్రాంతాలలో ఈసారి ఎన్నడూ లేనంతగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తమిళనాడు అంతటా ఇదే పరిస్థితి. దీంతో సామాన్య ప్రజలు మధ్యాహ్నం వేళ బయటకు రావడానికి జంకుతున్నారు. ఓవైపు నీటి ఎద్దడి ఉన్నప్పటికీ ప్రయాణీకుల కోసం బస్టాండ్ కూడలిలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఆదేశాలతో దీనిని ఏర్పాటు చేసినట్టు పార్టీ పారిశ్రామిక విభాగం రాష్ట్ర కార్యదర్శి రామలింగం తెలిపారు. చలివేంద్రంలో తొలిరోజు పుచ్చకాయలు, నీరుమజ్జిగ, కీరదోస, పనసపండ్లు, అరటిపండ్లు వంటివి పంపిణీ చేశారు. కార్యక్రమానికి వర్తక విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజన్ అధ్యక్షత వహించారు. ఉత్తర మండల అధ్యక్షుడు తంగరాజు స్వాగతం పలికారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

పోలింగ్ కేంద్రాలకు తరలిన రాయచూరు సిబ్బంది





పోలింగ్ యంత్రాలను చెక్‌లిస్ట్ వారీగా సరిచూసుకుంటున్న సిబ్బంది

రాయచూరు, మే 6 : లోకసభ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు తరలి వెళ్లారు. ఇందుకోసం సోమవారం నగరంలోని ఎల్‌వీడీ,ఎస్ఆర్‌పీయూ కళాశాల కేంద్రాల వద్ద ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసిన శాసనసభ నియోజక వర్గాల వారిగా సిబ్బందికి ఈవీఎం యంత్రాలను అధికారులు అప్పగించారు. సోమవారం ఉదయం 7 గంటలకంతా రెండు కళాశాల కేంద్రాల వద్దకు చేరుకున్న సిబ్బంది తమకు కేటాయించిన ఈవీఎం యంత్రాలను ఇతర పోలింగ్ యంత్రాలను చెక్‌లిస్ట్ వారిగా సరిచూసుకుని తమకు కేటాయించిన కేంద్రాలకు తరలి వెళ్లారు. సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు అధికారులు పెద్దసంఖ్యలో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను ఏర్పాటు చేయగా మధ్యాహ్నం 12 గంటల్లోగా సిబ్బంది మొత్తం ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా రాయచూరు లోకసభ నియోజక వర్గం పరిధిలో మొత్తం 20,10,437 మంది ఓటర్లు ఉండగా వారిలో 9,94,646 మంది పురుషులు, 10,15,158 మంది మహిళలతో పాటు 299 మంది థర్డ్‌జండర్ ఓటర్లు ఉన్నారు. పోలింగ్ నిర్వహణ కోసం మొత్తం 2,203 కేంద్రాలను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్‌వీడీ కళాశాల వద్ద మాట్లాడిన డీసీ చంద్రశేఖర్ నాయక్, పోలింగ్ నిర్వహణ కోసం 8,464 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. రాయచూరు లోకసభ నియోజక వర్గం పరిధిలో 8 శాసనసభ సెగ్మెంట్‌లు ఉండగా పోలింగ్ 2,203 కేంద్రాల్లో మే 7వ తేదీ(నేడు) మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనుందన్నారు. సమస్యాత్మక, అతిసమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టబందోబస్తు ఏర్పాటు చేశామని ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలని కోరారు.



పోలింగ్ కేంద్రాల వద్ద సిద్ధంగా ఉన్న బస్సులు